క్లుప్తంగా

నేడు, రేపు పొడిగా వాతావరణం

కడప అగ్రికల్చర్: జిల్లాలో నేడు, రేపు వాతావరణం పొడిగా ఉంటుందని కృషి విజ్ఞాన కేంద్ర వాతావరణ శాస్త్రవేత్త స్వామి చైతన్య తెలిపారు. జిల్లాలో ప్రస్తుతం ఉన్న ఉష్ణోగ్రతలకంటే 2 నుంచి 4 డిగ్రీల ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉందన్నారు. దీంతో వేడితో కూడిన అసౌకర్యమైన వాతావరణం ఏర్పడే అవకాశం ఉంటుందని తెలిపారు. జిల్లా ప్రజలు ఎండలకు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

టీచర్‌పై చర్యలు తీసుకోవాలి

కడప ఎడ్యుకేషన్: ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ఉంటూ మోసాలు చేయడంతోపాటు ఆర్థిక నేరాలకు పాల్పడుతున్న నంద్యాల వెంకట గంగరాజును తక్షణమే ఉద్యోగ విధుల నుంచి తప్పించాలని భారత విద్యార్థి ఫెడరేషన్ కడప జిల్లా కార్యదర్శి సగిలి రాజేంద్రప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ విషయమై మంగళవారం పాఠశాల విద్య ఆర్‌జేడీ వెంకట క్రిష్ణారెడ్డిని తమ కార్యాలయంలో కలిసి వినతిపత్రమిచ్చారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ఉంటూ నకిలీ విజిలెన్స్ అధికారిగా అవతారం ఎత్తి కడప పట్టణంలోని నిహాల్ స్కిల్ సెంటర్ నిర్వాహకును డబ్బుల కోసం బెదించిన ఉపాధ్యాయుడు గంగరాజుపై చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షులు బక్కే సురేష్‌నాయక్ పాల్గొన్నారు.

ప్రతిభ చాటిన యాదవ విద్యార్థులకు సత్కారం

కడప రూరల్: పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ప్రతిభ చాటిన యాదవ విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను అందజేస్తున్నట్లు రాయలసీమ యాదవ కమ్యూనిటీ వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు జీ నారాయణ యాదవ్ తెలిపారు. 2023 సంవత్సరం 10వ తరగతి పరీక్షా ఫలితాల్లో అత్యధిక మార్కులు పొందిన వారికి తమ అసోసియేషన్ తరఫున సత్కారం ఉంటుందని వివరించారు. విద్యార్థులు గ్రామీణ ప్రాంతానికి చెందిన నిరుపేదలు, ప్రభుత్వ పాఠశాలల్లో చదివి ఉండాలన్నారు. వివరాలకు సెల్ నంబరు 94408 49234ను సంప్రదించాలని పేర్కొన్నారు.

22 నుంచి 'ఏపీ జీఈఓ' రిలే నిరాహార దీక్షలు

కడప రూరల్: ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 22 నుంచి నిర్వహించే రిలే నిరాహార దీక్షలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షులు రమేష్ కుమార్ పిలుపునిచ్చారు. సోమవారం సాయంత్రం స్థానిక కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని నియోజక వర్గాల వారీగా ఈ నెల 22 నుంచి 31వ తేదీ వరకు రిలే నిరాహార దీక్షలను చేపడుతున్నట్లు తెలిపారు. జిల్లా కార్యదర్శి సుదర్శన్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి రఘురామనాయుడు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: రాష్ట్రంలో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి గంగా సురేష్ డిమాండ్ చేశారు. మంగళవారం నగరంలోని ఎస్టీయూ కార్యాలయంలో వివిధ విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో చర్చా వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గత ఎన్నికల సమయంలో రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 2.30 లక్షలు ఉద్యోగాలు భర్తీల చేస్తామని అందుకు అనుగుణంగా జనవరి ఒకటవ తేదీన జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని ఇచ్చిన హామీని విస్మరించారన్నారు. ఉద్యోగ విరమణ వయస్సు 60 నుంచి 62 సంవత్సరాలకు పెంచడం దారుణమన్నారు. ఈ సమస్యలపై విజయవాడలో నిరుద్యోగ ధర్నా చేపట్టనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో వివిధ విద్యార్థి, ప్రజా సంఘాల నాయకులు దస్తగిరి, సిద్దిక్, తిరుమలేష్, బండి సుమంత్, వీరణాల శివకుమార్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక ఫలితాలు బీజేపీకి చెంపదెబ్బ

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: కర్ణాటక ఎన్నికల ఫలితాలు బీజేపీకి చెంపదెబ్బ అని ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ఎస్. రవిశంకర్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని ఆర్‌సీపీ కార్యాలయంలో నిర్వహించిన రాష్ట్ర కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు ఇప్పటికైనా మతతత్వ విధానాలు వదిలి ప్రజలకు అవసరమైన విధానాలు చేపట్టాలని సూచించారు. ముఖ్యంగా కర్ణాటక ప్రజలు లౌకిక, ప్రజాస్వామ్యాన్ని గౌరవంగా నిలబెట్టారన్నారు. కేంద్ర ప్రభుత్వం రాయలసీమకు రావాల్సిన పరిశ్రమలు, నీటిపారుదల ప్రాజెక్టులు పూర్తికి నిధులు కేటాయించకుండా నిర్లక్ష్యం వహించడం తగదన్నారు. ఆర్‌సీపీ నాయకులు లింగమూర్తి, నాగన్న, ఆంజనేయులు పాల్గొన్నారు.

రేపు గడప గడపకు మన ప్రభుత్వం

వీరపునాయునిపల్లె :గంగిరెడ్డిపల్లె సచివాలయ పరిధిలోని సంగాలపల్లె, మిట్టపల్లె, గంగిరెడ్డిపల్లె గ్రామాల్లో గురువారం మధ్యాహ్నం 2 గటంలకు జరిగే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి పాల్గొంటారని మండల కన్వీనర్ రఘునాథరెడ్డి తెలిపారు. ఎంపీటీసీలు, సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కంపోస్టు యార్డు స్థలంలో పార్కు అభివృద్ధి

– నగరపాలక స్టాండింగ్ కమిటీ తీర్మాణం



స్టాండింగ్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ సురేష్‌బాబు

కడప కార్పొరేషన్:ఉక్కాయపల్లె కంపోస్టు యార్డులో ఖాళీగా ఉన్న స్థలంలో పార్కు అభివృద్ధి చేసి, ఫుడ్ కోర్టు ఏర్పాటు చేయుటకు టెండర్లు ఆహ్వానించాలని నగరపాలక స్టాండింగ్ కమిటీ నిర్ణయించింది. మంగళవారం సాయంత్రం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో మేయర్ సురేష్ బాబు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ తరహాలో ఎన్‌ఫోర్స్‌మెంట్ టీం(ప్లాస్టిక్) , డిజాస్టర్ మేనేజ్‌మెంట్ వింగ్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇద్దరు వార్డు అడ్మిన్ సెక్రటరీల పర్యవేక్షణలో 20 మంది సిబ్బంది ఏర్పాటు చేయాలని, వారికి ఒక్కొక్కరికి రూ.12వేల చొప్పున గౌరవ వేతనాన్ని కార్పొరేషన్ జనరల్ ఫండ్ నుంచి చెల్లించేందుకు అనుమతిచ్చారు. 50వ డివిజన్ బచ్చుంపల్లెలో రూ.29.70లక్షలతో సీసీ డ్రైన్ నిర్మాణానికి, 21వ డివిజన్ ద్వారకా నగర్‌లో డ్రైన్‌ను రూ.22లక్షలతో మరమ్మతులు చేయుటకు జనరల్ ఫండ్‌నుంచి నిధులు మంజూరు చేయుటకు అంగీకరించారు. సరోజినీనగర్ ఎస్సీ కాలనీలో బోర్‌వెల్‌కు పంప్‌సెట్, ఇంటర్ కనెక్షన్ల కోసం రూ.12.25లక్షలను సాధారణ నిధుల నుంచి మంజూరు చేశారు. అమర్ ఆసుపత్రి వంతెనల సమీపంలో నిర్మించిన కలెక్షన్ వెల్ నుంచి రామనపల్లె ద్వారా వచ్చే తాగునీటిని సాయిపేట, బెల్లం మండీ, అక్కాయపల్లె ఈఎల్‌ఎస్‌ఆర్‌లు నింపాలని నిర్ణయించారు. ఈ మేరకు కలెక్షన్ వెల్ దగ్గర ఉన్న పెండింగ్ పనులకు గాను రూ.17.60లక్షలు మంజూరు చేశారు. కమిషనర్ ప్రవీణ్‌చంద్, డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, స్టాండింగ్ కమిటీ సభ్యులు సుబ్బారెడ్డి, వి. శిరీష, మేసా ప్రమీల రాణి, డిప్యూటీ కమిషనర్ రమణారెడ్డి, ఎస్‌ఈ రత్నాల రాజు, ఏసీపీ నాగేంద్ర, ఈఈలు పాల్గొన్నారు.

నిషేధిత ప్లాస్టిక్‌పై ఉక్కుపాదం

కడప కార్పొరేషన్: ప్రభుత్వం నిషేధించిన ప్లాస్టిక్‌ను వినియోగిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ ఎస్ఎస్ ప్రవీణ్‌చంద్ హెచ్చరించారు. మంగళవారం ఆయన పాత కలెక్టరేట్లో ఉన్న ప్లాస్టిక్ స్టాక్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకం వల్ల మానవాళికి, మూగజీవాలకు, పర్యావరణానికి ప్రమాదకరమైన పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందన్నారు. ప్లాస్టిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారి నుంచి 15టన్నుల ప్లాస్టిక్ స్వాధీనం చేసుకొని ప్రభుత్వ నిబంధనల ప్రకారం అపరాధ రుసుము విధించామన్నారు. ప్లాస్టిక్ కవర్ల బదులు జ్యూట్ బ్యాగులు వాడాలని సూచించారు.

• కడప నగరంలో మార్నింగ్ విజిట్‌లో భాగంగా కమిషనర్ మారుతీనగర్, రాజీవ్ స్మృతివనం పార్కు, రాజారెడ్డి వీధి తదితర ప్రాంతాల్లో పర్యటించి పారిశుధ్య పనులను పరిశీలించారు. పార్కును త్వరగా అందుబాటులోకి తేవాలని కాంట్రాక్టర్‌కు సూచించారు.

దోమతెరలు వాడాలి

కమలాపురం : దోమలు కుట్టకుండా ప్రతి ఒక్కరూ దోమతెరలు వాడాలని మలేరియా అర్బన్ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ నందకుమార్ అన్నారు. మంగళవారం జాతీయ డెంగీ దినోత్సవాన్ని పురస్కరించుకుని కమలాపురంలో ర్యాలీ నిర్వహించారు. ఈ దోమ పగలు మాత్రమే కుడుతుందన్నారు. దోమలు వృద్ధి చెందకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. అలాగే రాత్రిళ్లు దోమతెరలు వాడాలన్నారు. వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి కరపత్రాలు పంచుతూ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి నాగలక్ష్మీరెడ్డి, ఏఎన్ఎంలు, ఆశాలు, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే రాక

కమలాపురం : మండలంలోని పెద్దచెప్పలి సచివాలయ పరిధిలో బుధవారం రెండవరోజు జరిగే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి హాజరు కానున్నారని ఎంపీడీఓ శేషా చలపతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని శాఖల మండల స్థాయి అధికారులు పూర్తి సమాచారంతో ఈ కార్యక్రమానికి హాజరు కావాలని ఆయన తెలిపారు.

రక్తహీనతపై అప్రమత్తత అవసరం



విద్యార్థినికి టాబ్లెట్స్‌ను అందజేస్తున్న పాఠశాల విద్య ఆర్‌జేడీ వెంకట కృష్ణారెడ్డి

కడప ఎడ్యుకేషన్: రక్తహీనతపై అమ్మాయిలు అప్రమత్తంగా ఉండాలని పాఠశాల విద్య ఆర్‌జేడీ వెంకట కృష్ణారెడ్డి, సమగ్రశిక్ష జిల్లా అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి సూచించారు. మంగళవారం కడపలోని పలు ప్రాంతాల్లోని విద్యార్థిని ఇళ్లకెళ్లి రక్తహీనత పట్ల విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రక్తహీనత గల పిల్లలను పాఠశాలలో గుర్తించి వారికి ఆమీనిక్ పోలిక్ యాసిడ్ టాబ్లెట్‌ను అందచేయాలన్నారు. ఈ మాత్రలను వినియోగించడం వల్ల రక్తహీనత తగ్గుతుందన్నారు. ఏఎన్ఎం, ఆశా వర్కర్ల సహాయ సహకారాలతో టాబ్లెట్స్ ఉపయోగించుకోవాలన్నారు. ఎంఈఓ పాలెం నారాయణ, నగరపాలక మొయిన్ స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు నాగమణి, సీఆర్‌పీ కృష్ణలు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించండి

పులివెందుల రూరల్ : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలల ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏపీ ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డికి గురుకుల పాఠశాలల ఉద్యోగులు వినతిపత్రం అందించారు. మంగళవారం విజయవాడలో ఏపీ ప్రభుత్వ సలహాదారులు సజ్జల రామకృష్ణారెడ్డిని టీచర్స్ ఎమ్మెల్సీలు చంద్రశేఖరరెడ్డి, రామచంద్రారెడ్డి, ఏపీజీయూఎఫ్ చైర్మన్ కె.వెంకటరామిరెడ్డి, స్వర్స్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రభాకర్, వైఎస్సార్ గురుకుల ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నజురుల్లాల ఆధ్వర్యంలో గురుకుల పాఠశాలల ఉద్యోగులు కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెగ్యులర్ ఉద్యోగులకు 60 ఏళ్ల నుంచి 62 ఏళ్ల వయోపరిమితి పెంపు అమలు చేయాలని, కాంట్రాక్టు టీచర్స్ ప్రతి ఏడాదివలే 10 రోజుల గ్యాప్ పీరియడ్ తర్వాత రెన్యువల్ చేయాలని, గత 16 ఏళ్ల నుంచి పనిచేస్తున్న కాంట్రాక్టు టీచర్లను రెగ్యులర్ చేయాలని తదితర సమస్యలను పరిష్కరించాలన్నారు. ఇందుకు ఆయన స్పందించి మీ న్యాయమైన డిమాండ్లను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామన్నారు.

కాపాడు తల్లీ...విజయదుర్గమ్మ!



రాహుకాల పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కడప కల్చరల్ : ఆ విశాలమైన ప్రాంగణంలో మధ్యాహ్నం రెండు గంటలకే మహిళా భక్తులు కిటకిటలాడారు. ఆయమ్మను మనసారా కోరుకుంటే శుభాలు సిద్ధిస్తాయని భక్తుల నమ్మకం. శ్రావణమాసం ప్రారంభం కానున్న నేపథ్యంలో అమ్మవారి సన్నిధిలో రాహుకాల పూజల కోసం మంగళవారం మహిళలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. పలువురు మగవారు కూడా పూజల్లో పాల్గొన్నారు. కడప నగరం శ్రీ విజయదుర్గాదేవి ఆలయంలో ప్రతి మంగళవారంలాగానే ఈసారి కూడా రాహుకాల పూజలు నిర్వహించారు. రాహుకేతువు గ్రహ ప్రభావంతో ఏర్పడే బాధలు తొలగిపోతాయన్న విశ్వాసంతో జిల్లా నలుమూలల నుంచి భక్తులు విశేష సంఖ్యలో ఈ పూజలకు హాజరయ్యారు. తొలుత అమ్మవారి మూలమూర్తికి విశేష అభిషేకాలు, అలంకారం, అర్చనలు చేశారు. అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఆలయ ప్రధాన అర్చకులు భక్తులకు పూజా విధానాన్ని వివరిస్తూ కార్యక్రమం నిర్వహింపజేశారు.

ముస్లిం మైనార్టీల పక్షపాతి సీఎం వైఎస్ జగన్

చెన్నూరు : ముస్లిం మైనార్టీల అభ్యున్నతికి అహర్నిశలు కృషి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కమలాపురం నియోజకవర్గ ముస్లిం మైనార్టీల కన్వీనర్ అన్వర్‌బాషా కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం ఆయన చెన్నూరులో విలేకరులతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ నుంచి పవిత్ర హజ్‌యాత్రకు విజయవాడ నుంచి బయలుదేరు 1813 మంది యాత్రికుల విమాన టికెట్టుపై ప్రతి యాత్రికునికి రూ.80 వేలు అదనపు భారం పడుతుండటంతో సీఎం రూ.14.51 కోట్లు ఆర్థిక సాయం విడుదల చేశారన్నారు. తాను ముస్లిం మైనార్టీల పక్షపాతి అని నిరూపించుకున్నారని తెలిపారు.

క్రమశిక్షణతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు



విద్యార్థులకు గణితం బోధిస్తున్న శిక్షకుడు

కడప కల్చరల్ : క్రమశిక్షణను అలవర్చుకోవడం వల్ల విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని వ్యక్తిత్వ వికాస నిపుణులు సాయినేత్ర తెలిపారు. జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విద్యార్థుల వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా మంగళవారం స్థానిక కొండాయపల్లెలోని జిల్లా కేంద్ర గ్రంథాలయ ప్రాంగణంలో ఆయన హాజరైన విద్యార్థులకు క్రమశిక్షణ గురించి వివరించారు. మనిషిని ఉన్నతుడిగా మార్చే క్రమశిక్షణను విద్యార్థి దశ నుంచే అలవర్చుకోవలసి ఉంటుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు శిక్షకులు సత్యవతి స్పోకెన్ ఇంగ్లీషు నేర్పారు. ఇతర శిక్షకుల్లో కొందరు నీతి కథలు చెప్పగా, మరో శిక్షకులు చిత్రలేఖనం నేర్పారు. ఇంకొకరు నృత్యంలోని ప్రాథమిక అంశాలను నేర్పారు. శిక్షకులు రంగనాయకులు, డిప్యూటీ లైబ్రేరియన్ పవన్‌కుమార్, లైబ్రేరియన్లు పాల్గొన్నారు.

అన్నీ లెక్క ప్రకారమే!

జీవితంలో అన్ని అనుకున్నట్టే ప్రణాళిక ప్రకారం జరిగితే అంతకుమించిన విజయం మరొకటి లేదని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు, రీసోర్స్ పర్సన్ జానకిరాం అన్నారు. సంస్థ ఆధ్వర్యంలో స్థానిక రవీంద్రనగర్‌లోని జేవీవీ కార్యాలయంలో మంగళవారం వేసవి శిక్షణా శిబిరం కార్యక్రమంలో భాగంగా గణితంలో గమ్మత్తులను వివరించారు. జేవీవీ రాష్ట్ర నాయకులు ఏడీ దేవదత్తం పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో గణితాన్ని చతుర్విధ ప్రక్రియల పద్ధతిలో సులభంగా ఎలా చేయాలో చిన్నారులతో చేయించారు. గణితంతో సరదా ఆటలు ఆడించారు. చిన్నారులు సరదాగా పోటీపడి చిన్నచిన్న లెక్కలు చేశారు.

పేద మహిళలకు హైజినిక్ కిట్ల పంపిణీ



కిట్లను పంపిణీ చేస్తున్న సాయిగ్రేస్

కడప కల్చరల్ : ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లాశాఖ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లాలోని పలు గ్రామాలలో పేద మహిళలను గుర్తించి వారికి హైజినిక్ కిట్లను అందజేశారు. తొలుత నగర సమీపంలోని రామరాజుపల్లెలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. రెడ్‌క్రాస్ సొసైటీ స్పెషల్ ఆఫీసర్ సి.సాయిగ్రేస్ ముఖ్య అతిథిగా హాజరై కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమెమాట్లాడుతూ ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ విజయవాడ శాఖ నుంచి అన్ని జిల్లాలకు హైజినిక్ కిట్లు అందజేశారన్నారు. అందులో భాగంగా మన జిల్లాకు 100 కిట్లు పంపారని తెలిపారు. సంస్థ అధ్యక్షులు, జిల్లా కలెక్టర్ విజయరామరాజు ఆదేశాల మేరకు పలు గ్రామాలలో కొందరు పేద మహిళలను గుర్తించి ప్రత్యేక కార్యక్రమం ద్వారా వారికి ఈ కిట్లను అందజేస్తున్నామన్నారు. రూ. 1500 విలువగల ఒక్కొక్క కిట్‌లో మొత్తం 18 రకాల వస్తువులు ఉంటాయని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రెడ్‌క్రాస్ సొసైటీ మెడికల్ ఆఫీసర్ తేజ, జిల్లా కో–ఆర్డినేటర్ సుధాకర్‌బాబు, డీహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి మునెయ్య, రెడ్‌క్రాస్ వలంటీర్లు పాల్గొన్నారు.

జీలుగ విత్తనాల పంపిణీ

వీరపునాయునిపల్లె : మండలంలోని యు.రాజుపాళెం రైతు భరోసా కేంద్రంలో మంగళవారం మండల వ్యవసాయాధికారి ఆధ్వర్యంలో జీలగ విత్తనాలను మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతుల కష్టాలు గుర్తించి వారిని అన్నివిధాల ఆదుకుంటున్నారన్నారు. 50 శాతం రాయితీతో జీలగ, పిల్లిపెసర విత్తనాన్ని అందించడం జరుగుతోందన్నారు. సహాయ సంచాలకులు నరసింహారెడ్డి మాట్లాడుతూ రాజుపాళెం రైతు భరోసా కేంద్రానికి 13 క్వింటాళ్లు జీలగ విత్తనాలు మంజూరయ్యాయని ఇంకా ఎవరికైనా విత్తనాలు కావాలంటే రైతు భరోసా సిబ్బందిని సంప్రదించాలన్నారు. మండల వ్యవసాయ అధికారి శ్యామ్‌బాబు మాట్లాడుతూ వరి సాగు చేసే ప్రతి రైతుకు ఎకరాకు 10 కేజీలు జీలుగ విత్తనాన్ని రాయితీతో అందిస్తున్నామని ఈ అవకాశాన్ని వరి పంట సాగు చేసే రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

చింతకొమ్మదిన్నె : అటవీశాఖ నూతనంగా ప్రవేశపెట్టిన లైఫ్ అనే కార్యక్రమంలో భాగంగా పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన అవసరం మనందరిపై ఉందని డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ ఓబులేసు అన్నారు. మంగళవారం మామిళ్ళపల్లె పంచాయతీ పరిధిలోని నాయనోరిపల్లె గ్రామంలో లక్ష్యా అకాడమీ ఆధ్వర్యంలో లైఫ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పర్యావరణాన్ని పరిరక్షించడంతో పాటు ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించాలన్నారు. ఫారెస్ట్‌హెడ్ ఆఫీసర్ భరణి, బీట్ ఆఫీసర్ రఘువీర్ పాల్గొన్నారు.

విచారణ జరిపించాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: జీవీ ఫుట్‌బాల్ కుంభకోణంపై విచారణ జరిపించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర డిమాండ్ చేశారు. మంగళవారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. జీవి ఫుట్‌బాల్ యాప్‌లో పెట్టుబడులు పెడితే లాభాలు వస్తాయంటూ కొంతమంది ఏజెంట్లు ప్రచారం చేసి దాదాపు రూ. 50 కోట్లు పెట్టుబడులు పెట్టించుకొని కుంభకోణానికి పాల్పడ్డరని ఆరోపించారు. జిల్లాలో సైబర్ నేరాలు రోజు రోజుకు పెరిగిపోతున్నాయని ఈ నేరాలపై అవగాహన కల్పించేందుకు పాలక ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వం జీవి ఫుట్‌బాల్ యాజమాన్యంపై సైబర్ క్రైమ్ కేసు నమోదు చేసి ఏజెంట్లపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. సీపీఐ నాయకులు మైనుద్దీన్ పాల్గొన్నారు.

అనంత గ్రంథ సాగరం...బ్రౌన్ గ్రంథాలయం



సీపీ బ్రౌన్ గ్రంథాలయం



గ్రంథాలయంలోని పుస్తక విభాగం

కడప కల్చరల్ : సీపీ బ్రౌన్ గ్రంథాలయం...పేరు వినగానే సీపీ బ్రౌన్ మహాశయుడు గుర్తుకు వస్తాడు. ఆయన దేశం, మతం, వర్ణం కంటే చేసిన విలక్షణ సేవలే గుర్తుకు వస్తాయి. ఆయన సాగించిన ఆంధ్ర సాహితీ మహాయజ్ఞం కళ్ల ముందు నిలుస్తుంది. ఆ శిథిలాలపై ఆయన ఆరాధకుడు, సాహితీ తపస్వీ డాక్టర్ జానమద్ది హనుమచ్ఛాస్త్రి నిర్మించిన మహా సాహితీ సౌధం నేడు సజీవ సాక్ష్యంగా నిలిచి ఉంది. తెలుగు నాట అపురూపమైన, అరుదైన సరస్వతీ నిలయంగా నిలిచి ఉంది. లక్షలాది పుస్తకాలతో మన సంస్కృతి, వారసత్వ సంపద అయిన వందలాదితాళపత్ర గ్రంథాలు, రాగిరేకులు, వాటిపై రాసే ఘంటాలు ఈ సాహితీ సౌధంలో సేద తీరుతున్నాయి. ఈ అద్భుతమైన మూడు తరాల వారసత్వ సంపదను భావి తరాలకు అందించే బాధ్యత నుంచి మనం తప్పుకోకూడదు. మనం చదవడంతోపాటు భావి పౌరులైన మన బిడ్డలకు పుస్తకాలు చదివే అలవాటు చేద్దాం. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్ఠాత్మకంగా నేటి తరం చిన్నారుల కోసం రూపుదిద్దిన చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని ఈ పుస్తక క్షేత్రం నుంచే ప్రారంభిద్దాం! మన చిన్నారులను చదువరులుగా మారుద్దాం.

సభ్యత్వం తీసుకుందాం!

సీపీ బ్రౌన్ నిండా పుస్తకాలే. దాదాపు అన్ని భారతీయ భాషలతోపాటు విదేశీ భాషల పుస్తకాలు కూడా అందుబాటులో ఉన్నాయి. స్థానిక చరిత్రను తెలిపే అపురూపమైన కైఫీయత్తుల తెలుగు గ్రంథాలు కూడా ఉన్నాయి. తగినంత సిబ్బందీ ఉన్నారు. ఆసక్తిగల అంశాలపై క్షణాల్లో కోరిన పుస్తకాలను అందించే నిపుణులూ ఉన్నారు. కేవలం రూ. 500 చెల్లించి ఈ ప్రతిష్ఠాత్మకమైన సీపీ బ్రౌన్ గ్రథాలయంలో సభ్యులమవుదాం. ఇదికేవలం గ్రంథాలయమే కాదు. అత్యంత ప్రతిష్ఠాత్మకమైన యోగి వేమన విశ్వవిద్యాలయానికి అనుబంధంగా ఉన్న భాషా పరిశోధన కేంద్రం కూడా. సభ్యత్వం గల ప్రతి వారు కనీసం పక్షానికో, మాసానికో ఓసారి ఇందులో మనకు నచ్చిన రెండు పుస్తకాలను తీసుకుని తీరిగ్గా చదువుకుని జాగ్రత్తగా తిరిగి ఇచ్చే అవకాశం ఉంది. ఇక్కడి కొన్ని పుస్తకాలైనా చదివిన విద్యార్థులలో తప్పక ప్రత్యేకత కనిపిస్తుంది. పలు అంశాలపై అవగాహన ఏర్పడడంతోపాటు మంచి వక్తలుగా ఎదిగే అవకాశం ఉంది. గొప్ప రచయితలు, కవుల పట్ల అవగాహన కలుగుతుంది.

సౌకర్యాలు .. కడప నగరంలోని ప్రముఖ ప్రాంతమైన ఎర్రముక్కపల్లె కేంద్రం నుంచి నడక దూరంలో ప్రశాంతమైన వాతావరణంలో ప్రసిద్ధమైన ముని వాటికల ఆశ్రమంలా కనిపించే ఈ గ్రంథాలయం రోజూ ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు పనిచేస్తుంది. గురువారం సెలవు. ఇటీవలే ఈ కేంద్రానికి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి పేరిట గల ప్రతిష్ఠాత్మక పురస్కారం లభించి తన ఉన్నతిని చాటింది. పూర్తి వివరాలు, పుస్తకాల కోసం బ్రౌన్ గ్రంథాలయ సంచాలకులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి (సెల్ నెంబరు 9900003399) లేదా గ్రంథ పాలకులు హరిభూషణరావు (9490135295), ఎస్.రమేష్‌రావు (7093886059), సహాయ పరిశోధకులు డాక్టర్ సి.శివారెడ్డి (94408 59872), డాక్టర్ భూతపురి గోపాలకృష్ణశాస్త్రి (9966624276)లను సంప్రదించవచ్చు.

డెంగీ జ్వరంపై అప్రమత్తంగా ఉండాలి

చింతకొమ్మదిన్నె : మండలంలోని ప్రజలు డెంగీ జ్వరం పట్ల అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి రాఘవేంద్ర తెలిపారు. మంగళవారం డెంగీ డే సందర్భంగా మండలంలోని సీకేదిన్నె గ్రామంలో ర్యాలీ చేపట్టి మాట్లాడారు. ప్రజలు దోమలు కుట్టకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సురక్షితమైన నీరుతాగి వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎంపీడీఓ రవికుమార్‌రెడ్డి, వైద్యులు సునీత పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థికి జగనన్న విద్యా కానుక అందాలి

చింతకొమ్మదిన్నె : బడి తెరిచేనాటికి ప్రతి విద్యార్థికి జగనన్న విద్యా కానుక అందాలని ఆర్‌జెడీ వెంకట కృష్ణారెడ్డి, సమగ్ర శిక్ష ప్రాజెక్టు డైరెక్టర్ అంబవరం ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని సీకేదిన్నె జిల్లా పరిషత్ హైస్కూల్‌లో జగనన్న విద్యా కానుక మండల స్టాక్ పాయింట్‌ను వారు పరిశీలించారు. జగనన్న విద్యా కానుకలోని టెస్ట్ బుక్‌లు, ఏకరూప దుస్తుల నాణ్యతను పరిశీలించారు. పదవ తరగతి పరీక్షలో ఫెయిల్ అయిన విద్యార్థులకు నిర్వహిస్తున్న రెమిడీయల్ తరగతులను పరిశీలించి ప్రతి విద్యార్థి పదవ తరగతి సప్లమెంటరీ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించడానికి ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష సెక్టోరియల్ అధికారులు కేశవరెడ్డి, దశరథరామ్‌రెడ్డి, మండల విద్యాధికారి వెంకట్రామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఏపీ సంక్షేమ పథకాల పుట్టినిల్లు

– ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి



ప్రజలకు ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

కమలాపురం : సంక్షేమ పథకాల పుట్టినిల్లు ఏపీ అని ప్రపంచంలో ఎక్కడాలేనన్ని పథకాలు ఆంధ్రప్రదేశ్‌లో అమలు అవుతున్నాయని అది కేవలం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సీఎం కావడం తోనేనని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. మంగళవారం పెద్దచెప్పలి గ్రామంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. గ్రామ నాయకులు పెద్ద ఎత్తున బాణా సంచా పేల్చుతూ స్వాగతం పలికారు. ముందుగా ఎల్లమ్మ ఆలయంలో అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ప్రతి గడపకు వెళ్లిన ఎమ్మెల్యే వారి సమస్యలు తెలుసుకున్నారు. రేషన్ కార్డు, సీసీ రోడ్లు, ఇంటి స్థలాలు, పక్కా గృహాలు కావాలని ప్రజలు కోరడంతో అక్కడే ఉన్న అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరించారు. ఇంకా పథకాలు రానివి ఉంటే తన దృష్టికి తీసుకు రావాలని ప్రజలకు సూచించారు. అవ్వా తాతలకు వారి మనవడు జగనన్న ఇస్తున్న పింఛన్ రూ.2750 దేశంలో ఏ రాష్ట్రంలో ఇవ్వడం లేదన్నారు. పుట్టిన బిడ్డ మొదలుకొని పండుటాకుల వరకు అన్ని వర్గాల ప్రజలకు పథకాలు అందిస్తున్న ఏకైక సీఎం జగనన్న అన్నారు. చంద్రబాబునాయుడు దొంగ హామీలిచ్చి సీఎం అయ్యారని, ఒక్క హామీకూడా నెరవేర్చలేదన్నారు. బాబు తన పాలనంతా అవినీతికి కేర్‌ఆఫ్‌గా పెట్టుకున్నారన్నారు. జన్మభూమి కమిటీలు లంచాలు, కమీషన్లు ఇచ్చిన వారికే అరకొర పథకాలు ఇచ్చారన్నారు. ప్రస్తుత జగనన్న ప్రభుత్వం అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించిందన్నారు. 31 లక్షల మందికి ఇంటి స్థలాలు ఇవ్వడమే కాక 17లక్షల మందికి పక్కా గృహాలు కట్టించాడన్నారు.పెద్దచెప్పలి చిన్ని, మర్రి సుబ్బన్న, మహ్మద్ గౌస్, చంద్రపాల్, చంటి, అయ్యవార్‌యాదవ్ పాల్గొన్నారు.